ఆ అమ్మాయికి పదహారేళ్లుండవచ్చు. అతగాడికి ఇరవైకంటే ఎక్కువ ఉండవు. 'ఈడూ, జోడూ' ఐన దాంపత్యం వాళ్లది. వాళ్లిద్దరూ సాయంకాలం షికారుగా వీధినపడి పోతున్నారు. ఏవేవో చెప్పుకుంటున్నారు. కిలకిల నవ్వుకుంటున్నారు. తమ మాటలెవరైనా వింటున్నారేమో అన్న సంకోచం కాని, భయం కాని లేనేలేదు వాళ్లకి.

వాళ్ల మాటలు వెనకాల నడిచి వస్తూన్న కనకాచలం చెట్టికి వినబడుతూనే ఉన్నాయి. ఆ వృద్ధుడు ఆ జంటకొక పది అడుగుల వెనకాల గాలివాలున ఉన్నాడు. "చూసేవా, వాళ్లెంత హాయిగా ఉన్నారో! ప్రథమ యవ్వనం తొణికిసలాడుతోన్నప్పుడే హాయి! నీకేముందిక? తొంభైయేళ్ల తొక్కువి! యముడు పంపే టెలిగ్రాముకి ఎదురుచూస్తున్నావు! ఈలోగా ఎంత దక్కితే అంతే అని వాళ్ల పలుకులు విని ఆనందించు" అంటూ గాలిదేవుడు ఆ నూతన దంపతుల సంభాషణంతా తెచ్చి, చెట్టిగారి చెవులకు వప్పగించాడు.




ఆ జంట సందువదలి మౌంటురోడ్డు ప్రవేశించారు. కుడిచేతి వైపున సింప్సన్ కంపెనీ 'షోరూము' కనపడింది. అద్దాల వెనకాల స్ప్రింగుమంచం, దానిమీద కుషను, రకరకాల సోఫాలు, కుషన్లు కనబడి ఆకర్షించాయి. ఆ పడకగది ఫర్నిచరు సెట్టు అంతా "రూ. 816/" అని అట్టముక్కపై వెల వేసి వుంది. "విత్తంకొద్దీ వైభవం!" అంది అమ్మాయి. "మీ వాళ్లు కొనివ్వకూడదూ?" అన్నాడతగాడు ఛలోక్తిగా. ఆమెకు కొంచెం కోపం వచ్చి ముఖం ఎర్రబడింది. అతగాడే మళ్లీ. "ఎందుకూ, ఎప్పటికైనా నాకొక పెద్ద ఉద్యోగం కాకపోతుంది గనుకనా? అప్పుడు నేనే కొంటాను!" అన్నాడు.

కనకాచలంగారు, అతగాడామెకు కోపం రప్పించడం అంతలోనే సమాధానపరచడం, చూసి ఉప్పొంగిపోయాడు. "చిలకా గోరింకల్లాగున వున్నారర్రా! చిట్టి చిట్టి తగాయిదాలు, రాజీనామాలూను! పాపం మీకా స్ప్రింగు సామాను మీద మనసుపోయింది కదూ, పెద్ద ఉద్యోగం వస్తే కొంటానంటున్నాడు వెర్రి నాయన! ఇప్పుడేదో చిన్న నౌకరీయే అన్నమాట. వీళ్ల మనసు యెప్పుడైనా తీరుతుందా? పోనీ నేను ఆ 816 రూపాయలూ ఇచ్చి 'కొనుక్కోండర్రా?' అంటే యెలాగుంటుంది? నాకు బ్యాంకులో లక్షలకొద్దీ డబ్బు మూలుగుతోందాయిరి. ఏం చేసుకోను వెధవ డబ్బు? నా అనంతరం తినటానికి యెవళ్లో లేకపోలేదు. ఐతేం, ఈ పిన్న దంపతులెవళ్లో నాకు తెలవకపోయినా, వీళ్ల ఆ కాస్త మనసూ నేను తీరుస్తే, వీళ్లెంతో ఆనందిస్తారు. 'ఎవరీయన? మన ముక్కూ మొహం ఎరక్కపోయినా వెనకాలేవస్తూ మన కోరిక విని తథాస్తు దేవతకు మల్లే ఇట్టే తీర్చేశాడు!' అని ఆశ్చర్యపోతారు. బలే గమ్మత్తుగా వుంటుందప్పుడు!" అంటూ కనకాచలంగారు ఆ దంపతులను ఆపబోయాడు. కాని వెంటనే ఆయన ఆలోచన మరొక ఫక్కీని వెళ్లింది. 'అరెరె, ఎంత తెలివి తక్కువ ఆలోచన నాది! వీళ్లు కష్టార్జితమైన సొమ్ముతో యీ సామాను కొనుక్కున్నప్పుడు కలిగే ఆనందం, నామూలాన యిలాగ తేరగా వచ్చిపడితే కలుగుతుందా? నా సరదాకొద్దీ వీళ్లకు డబ్బు ఇచ్చి, వీళ్లంతట వీళ్లు సంపాదించుకోవలసిన సంతోషాన్ని మనం చెడగొట్టకూడదు" అంటూ ఆయన తన వుద్దేశం మార్చుకున్నాడు.

ఆ మిథునం ముందుకు సాగేరు. వాళ్లకు యెదురుగా ఒక నావికుల గుంపు వచ్చింది. "ఎవళ్లండీ వీళ్లు? వీళ్ల డ్రెస్సంతా అదోరకంగా వుంది," అన్నదామె. "వీళ్లు నావికులు. ఓడల్లో యుద్ధం చేసేవాళ్లు," అన్నాడాతడు. వాళ్ల సంభాషణంతా అటుపైన ఓడలమీదకీ, సముద్రం అవతలవుండే దేశాలమీదకీ,

ద్వీపాలమీదకే పోయింది. "మొన్న సినమాలో చూసిన ద్వీపమేదో చాలా బాగుంది కదండి? ఆ కొబ్బరితోటలూ, కోతులూ, ఆ కోతులు కథలోని ప్రేమికులకు కొబ్బరికాయలు పడెయ్యటం, చాలా తమాషాగా వుంది" అన్నదామె. "ఔను, ఆ ద్వీపాలను, 'సౌత్ సీ ఐలెండ్సు' అంటారు. తెల్లవాళ్లు దేశదేశాలనుంచి వినోదంగా గడపటానికి అక్కడికి ఓడలమీద వస్తొంటారు. తెల్లవాళ్లు కొత్తగా పెళ్లి చేసుకున్నప్పుడు ఎవళ్ల జోక్యం ఉండకుండా స్వేచ్ఛగా వుండటానికని ఇలాంటి ద్వీపాలకు పోయి కొన్నాళ్లు అక్కడ గడిపి వస్తారు. దాన్నే వాళ్లు 'హనీ మూన్' అంటారు. 'హనీ' అంటే 'తేనె', 'మూన్' అంటే 'చంద్రుడు' అన్నాడాతడు. "మనం కూడా అలాగ యే ద్వీపానికైనా వెడితేనో హాయిగా!" అంది ఆమె. "నాకూ అలాగే వుందిమరి. కాని డబ్బో! ఓడ మీద ప్రయాణం అంటే బోలెడు డబ్బు కావాలి' అన్నాడాతడు.

ఇదంతా చెట్టిగారి చెవిన బడుతూనే ఉంది. "మీకంటే 'బోలెడు' అనిపిస్తోంది కాని ఆ సొమ్ము నాకొక లెక్కలోది కాదర్రా వెర్రి పిల్లల్లారా. పి.అండ్ ఓ. కంపెనీ వాళ్లని నేను బాగా ఎరుగుదును. మీకు ఒక ఓడలో మొదటి తరగతి టిక్కెట్లను కొని ఇచ్చి, మీ ప్రయాణం సుఖంగా ఉండేట్లు ఏర్పాటు చెయ్యగలను... కానీ ఓడలో మొదటి తరగతి ప్రయాణీకులు ఎలాగా ప్రవర్తించాలో, ఆ పద్ధతులూ పంపిణీలూ మీకు తెలుసా మరి? ఇప్పుడంటే చెన్నపట్నం వచ్చారుగాని మీరు ఏ గోదావరి తీరాన్నో ఒక పల్లెలో పుట్టి పెరిగినవాళ్లై యుంటారు. అలాంటప్పుడు మిమ్మల్ని తీసుకుపోయి ఒక గొప్ప ఓడలో ఫస్టుక్లాసు ప్యాసింజర్ల మధ్య పడేస్తే ఏం లాభం? అక్కడివాళ్లంతా మిమ్మల్ని 'బైత'ని హేళన చేస్తారు. మీకు సంతోషం కలిగిద్దామని చేస్తే చివరకు మీకు చెర ఐ వూరుకుంటుంది. మొదటి తరగతికన్న రెండోతరగతి మేలేమో. అలాగా అనటానికి వీల్లేదు. కొంచెం తేడాగాని, ఆ రెండు తరగతులకి అట్టే భేదం లేదు. మూడవ తరగతే ఇలాంటి వాళ్లకి సరిపడుతుంది... కాని మూడవ తరగతి బొత్తిగా అన్యాయమేమో. రంగం మోల్మేనూ కూలికోసం వెళ్లే అలగా జనం అంతా మూడవ తరగతిలో ఎక్కి వెడుతుంటే చూశానుగా! మూడవ తరగతి ప్రయాణం కన్నా నరకం వేరే వుండదు. ఈ దంపతుల్ని సుఖంగా హాయిగా ఇంటిపట్ల



**సాధన మగాడి గొంతుతో పాడింది**

*'ఓ కౌన్ థీ?' (తెలుగులో 'ఆమె ఎవరు?') చిత్రంలోని 'నైనా బర్సే...' పాట రికార్డింగ్ సమయంలో లతామంగేష్కర్ అనారోగ్యం వల్ల షూటింగ్ రద్దయ్యే పరిస్థితి ఏర్పడింది. అప్పుడు సంగీతదర్శకుడు మదన్‌మోహన్, తాను పాడితే రికార్డు చేసి, షూటింగులు ముగించమన్నాడు. అలాగే చేశారు. చిత్రీకరణ సమయంలో, ఓ సర్దార్జీ చూసి, "హీరోయిన్ మగాడి గొంతుతో పాడితే ఆ చిత్రం హిట్టయినట్లే!" అని ఎద్దేవా చేశాట్ట. అప్పుడు కూడా నిర్మాతకు మదన్‌జీయే ధైర్యం చెప్పి షూటింగులు పూర్తి చేయించాడు. ఆటు తరువాత లత చేత డబ్ చేయించారు పాటను. ఆ చిత్రమూ, అందులోని పాటలూ సూపర్ హిట్లు కావటం అందరికీ తెలిసిందే!*

ఉండనివ్వక, ఏం పాముకుంటారని ఓడమీద పంపటం?" అనుకొని కనకాచలం ఆ పాపాని కొడిగట్టుకోవడం విరమించుకున్నాడు.

చెట్టిగారు నిశ్చయాని కొచ్చేలోగా ఆ దంపతులేదో మరో గొడవలో పడ్డారు. ఆ కొత్త కోరిక యేమిటో చెట్టి చెవిలో పడలేదుగాని అదీ డబ్బు మీద ఆధారపడి వున్నదే అని మాత్రం తేలింది. ఏమంటే ఆ యువకుడు తన పడుచుతో, "అంతా డబ్బుతో ఉందనుకో. 'ధనమూలం మిదం జగత్' అని ఊరికే అన్నారా?" అన్నాడు. ఔను, అందుకేగా నేను 'విత్తం కొద్దీ వైభవం' అంట? డబ్బు లేనివాళ్లకి ప్రతీదీ అందని మ్రానిపండే. డబ్బుంటే ఏ సుఖమైనా అరచేతిలో వెన్నముద్దై చిక్కుతుంది." అని భర్తతో యేకీభవించిందామె.

కాని చెట్టి, "ఎంత అమాయకులర్రా మీరిద్దరూను! డబ్బు సుఖాన్ని చేకూరుస్తుందర్రా వెర్రి మొహాల్లారా? నూరు రూపాయలు పెట్టుబడితో వ్యాపారం మొదలెట్టిన నాకు ఇప్పుడు కొన్ని లక్షలు మూలుగుతున్నాయి! నేనేం సుఖపడ్డాను? ధనాన్ని గూర్చి మీరిద్దరూ ఇప్పుడు వెల్లడి చేసిన ఆ అభిప్రాయం శుద్ధ పొరపాటని నిరూపించటానికి నాకెంతో సేపు పట్టదు. ఎందుకూ, ఒక్క పదివేల రూపాయలు తెచ్చి మీ చేతిలో పోస్తే సరి, ఆ డబ్బు మూలాన్ని ఎన్నెన్ని కీడులు మూడుతాయో మీకే తెలుస్తుంది!" లేకుంటే కలిగే దుఃఖం కన్నా ఉంటే ఉన్న దుఃఖం ఎక్కువ కాదర్రా కుర్రవాళ్లల్లారా. 'డబ్బు, డబ్బో' అంటున్నారు. వెధవ డబ్బు! డబ్బు చేరితే సుఖంగా నిద్రకూడా పట్టదు తెలుసా? ఆ పదివేలూ ఇచ్చి మీ సుఖనిద్ర చెడగొట్టమంటారా నన్ను, చెప్పండి... ఊహూ! నేనా పాపపు పని చెయ్యను! మానస సరోవరంలోని హంసలకుమల్లే హాయిగా ఆనందంలో తేలిపోతున్నారు మీరిప్పుడు. ఇలాగే ఉండండి. డబ్బు లేదని విచారించకండి. వెధవ డబ్బు" అని దాన్ని శపిస్తో, చేయబోయిన ఆ వాగ్దానం ఉపసంహరించుకున్నాడు.

ఆమె చేతిలోంచి రుమాలు జారి క్రిందపడింది. ఆమె తీసుకుందామని వెనక్కి తిరిగింది. ఆ లోగానే ఆ యువకుడు వంగి దాన్ని తీసి ఆమెకెంతో సొగసుగా అందించాడు. ఆ చిరునవ్వు మొహంలోని సోయగాన్ని చూసి ఆమె, 'ఎంత అందగాడు!' అనుకుంది. బటానీలూ, వేయించిన వేరుశనగ పలుకులూ జంగిడలో పోసి అమ్మ దెస్తూ ఒకడు ఎదురయాడు. యువకుడు అణా వేరుశనగలూ, అర్ధణా బటానీలు కొని ఆమె రుమాలులో పోశాడు. జంగెడవాని చేతిలో పావలా కాసు పడేసి, చిల్లరకై, నడుస్తోనే చెయ్యి జాపేడు. జంగెడవాడు చిల్లర ఇచ్చి ముందుకు పోయేంతలో దానిలో అర్ధణాకాసు యువకుని చేతిలో గాక క్రిందపడిపోయింది. "ఏమిటి, వెదుకుతున్నారు?" అంది పడుచు. "అర్ధణా కాసు ఎక్కడో పడిపోయింది," అన్నాడతను.

'పోనిద్దురూ, అర్ధణాయేకదా, యే ముష్టివానికో దొరికితే సంతోషిస్తాడు!" అని ముందంజ వేసింది. అతడూ ఆమెననుసరించి వెళ్లేడు.

ఆ వెనకాల యింకా వస్తూ వున్న కనకాచలం చెట్టికి ఆ అర్ధణాకాసు కనబడింది. అతడు వెంటనే దాన్ని తీసుకుని జేబులో వేసుకున్నాడు.

■